# ఆ క్షణాన

ఏ సూచనా లేకుండా
అర్ధాంతరంగా ముగిసిన నాటకాలు
చూసి చూసి
తడిసి పోయిన చొక్కాని విప్పేసి
గాలిలో ఆరుబయట కూర్చుంటే
నిఘావేస్తూ
ఆకాశంలో చుక్కలు సైతం
ముఠాలు ముఠాలుగా కనిపిస్తున్నాయి

ప్రతీకారమో ఆత్మరక్షణో
అడవిలో మృగంలా

వేగమో దాహమో
ఉప్పెనలా

కోపమో ద్వేషమో
భూకంపంలా

గాలి ఆడటం లేదు బయట కూడా –

ఎలాగో ఒక అల్లిక
ఆకృతి చెందుతున్నప్పుడు
ఏ కొద్ది ఆలస్యమైనా
సందేహాలు సందేహాలుగా కలవరం

ఎంతటి అనివార్య కారణాలతో

సశేషాలైనా సరే –
మళ్లీ మొదలయే వరకూ
విరామ సంగీతం వినబడినా చాలు